నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 4 నవంబర్ 2024 | NIZAMABAD


## రైస్‌మిల్ నేతల కుటిల బుద్ధి



బాన్సువాడ మండలంలోని కొల్లూర్, సోమేశ్వర్ గ్రామాల శివారులో ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న రైతులు (ఫైల్)

ధాన్యం సేకరణ అక్టోబర్ మొదటి వారంలోనే షురూ అయ్యింది. అంతకు ముందే ప్రభుత్వం ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం మొద్దు నిద్రలో కొనసాగి ఇప్పటికిప్పుడు రైస్ మిల్లర్లతో ఒప్పందాలకు ప్రయత్నాలు చేస్తోంది. బ్యాంక్ ష్యూరిటీ, అఫిడవిట్, బాండ్ పేపర్ ద్వారా ఒప్పందాలు చేసుకోవాలని చెప్పడంతో రైస్ మిల్లర్లు మొండి కేస్తున్నారు. సన్న వడ్లను మర ఆడించడం ద్వారా ప్రస్తుతం చెల్లించే కమీషన్ సరిపోదంటూ వాదిస్తున్నారు. పైగా సీఎంఆర్ కోసం ఒప్పందాలు చేసుకునేందుకు కఠిన నిబంధనలు విధించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డిలో ఒప్పందాలు చేసుకునేందుకు రైస్ మిల్లర్లు క్యూ కడుతున్నారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ధీమా దక్కడంతో వారంతా సీఎంఆర్ విషయంలో ముందుకెళ్తుండగా.. నిజామాబాద్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. అతికొద్ది మంది మాత్రమే ష్యూరిటీ ఇవ్వడానికి ముందుకువచ్చారు. ఒప్పందాలను ఆలస్యం చేయడం ద్వారా రైతుల నుంచి సన్న వడ్లను తక్కువకే లాగేసుకోవచ్చనే ఆలోచనలో ఇక్కడ కొంత మంది రైస్ మిల్ సంఘంలోని కీలక బాధ్యులు కుటిల ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. పలు రాజకీయ పార్టీలతో అంటకాగుతున్న ఓ నాయకుడి దుర్బుద్ధితోనే ప్రభుత్వంతో ఒప్పందాల వ్యవహారంలో జాప్యం జరుగుతున్నట్లు చర్చ నడుస్తోంది.

### తెరపైకి కొత్త నిబంధనలు ..

పంట కోతలు పూర్తయినా ఓ వైపు కొనుగోళ్లు చేపట్టకపోవడం, మరోవైపు అమ్మిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు దించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీఎంఆర్ కేటాయింపు విషయంలో బ్యాంకు ష్యూరిటీ కోసం అఫిడవిట్, బాండ్ పేపర్లను సైతం సమర్పించాలని కాంగ్రెస్ సర్కారు కొత్త నిబంధనలను తెర మీదికి తెచ్చింది. గతంలో కస్టం మిల్లింగ్ రైస్ విషయంలో పలువురు మిల్లర్లు అక్రమాలకు పాల్పడంతో పౌరసరఫరాల శాఖ దిద్దుబాటు చర్యలను చేపట్టింది. ధాన్యం కొనుగోళ్లు మొదలై నెలన్నర రోజులవుతున్నా సర్కారుకు, మిల్లర్ల మధ్య సయోధ్య కుదరకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. దొందూ... దొందే అనే రీతిలో సాగుతున్న మిల్లర్లు, ప్రభుత్వ వైఖరితో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

### మద్దతు ధరకు మంగళం



బహిరంగ మార్కెట్లో సన్న వడ్లకు భారీ డిమాండ్ ఉన్నది. కోతలు షురూ అయిన మొదట్లో క్వింటాలు రూ.2300 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. పచ్చి వడ్లను సైతం సేకరించడంతో అదే అదునుగా భావించి రైతులు సైతం వారికే ముట్ట జెప్పారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో లక్షలాది ఎకరాల్లో కోతలు షురూ అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు మాత్రం సమయానికి ప్రారంభించకపోవడంతో గత్యంతరం లేక దళారులను ఆశ్రయించారు. దీంతో కాంగ్రెస్ సర్కారు ఇస్తామన్న రూ.500 బోనస్‌ను రైతులు కోల్పోవాల్సి వచ్చింది. కోతలు మొదలైన సమయంలో గిట్టుబాటు ధర దక్కినప్పటికీ ప్రస్తుతం విపరీతమైన దోపిడీ పర్వం రాజ్యమేలుతోంది. సర్కారు పట్టించుకోకపోవడంతో రైస్ మిల్లర్లు తెగబడి రైతులను ముంచేస్తున్నారు. నిజామాబాద్‌లో 480 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వ్యాపారులు చొరబడి ఇష్టారీతిన ధాన్యాన్ని సేకరిస్తున్నారు. చాలాచోట్ల అక్టోబర్ నెలాఖరు నుంచి క్వింటాలుకు రూ.2వేల లోపే చెల్లింపులు చేస్తున్నారు. మద్దతు ధర దక్కకపోవడంతో చాలా మంది రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. మద్దతు ధరకు రైస్ మిల్లర్లు మంగళం పాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

- ఇరువురి రాజకీయాలకు అన్నదాత కుదేలు
- నిజామాబాద్‌లో మద్దతు ధరకు మంగళం
- ధాన్యం సంచులు దించుకునేందుకు ససేమిరా
- చేష్టలుడిగి చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- చక్రం తిప్పుతున్న రైస్‌మిల్ సంఘం కీలక నేత
- ఒప్పందాలు చేసుకోవడంలోనూ మీనమేషాలు

'కొనుగోళ్ల'పై మిల్లర్లు, సర్కారు దోబూచులాట


# దొందూ.. దొందే !




'ధాన్యం కొనుగోళ్ల'పై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతన్నలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వ ఉదాసీన వైఖరి, రైస్ మిల్లర్ల బాధ్యతారాహిత్యం అన్నదాతలకు తలనొప్పులను తెస్తున్నది. పుట్లకొద్దీ సన్న రకం వడ్లు వస్తుండడంతో వాటిని సీఎంఆర్ రూపంలో తీసుకునేందుకు రైస్ మిల్లర్లు ససేమిరా అంటున్నారు. మర ఆడించిన బియ్యం విషయంలో ప్రభుత్వం చెల్లించే ధరలతో గిట్టుబాటు కాదంటూ వాదిస్తున్నారు. ఈ విషయంలో పలు మినహాయింపుల కోసం రైస్‌మిల్లర్లు చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మొండిగా ముందుకెళ్తున్న సర్కారుకు దీటుగా రైస్‌మిల్లర్లు సైతం అదే స్థాయిలో మిన్నకుండిపోతున్నారు. వీరి తీరు ఫలితంగా రైతులు రోడ్డున పడుతున్నారు.

– నిజామాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### బ్లాక్‌లిస్టులో ఉన్న మిల్లులపై చర్యలేవీ?



మార్కెట్లో ధాన్యం రాక మందగించిన సమయంలో ఒప్పందాలు చేసుకుంటే దొడ్డు రకం వడ్లు రెండు లక్షల మెట్రిక్ టన్నులు మిగిలే అవకాశం ఉంది. అనివార్యంగా ఈ మొత్తాన్ని రైస్ మిల్లర్లకే ప్రభుత్వం అప్పగిస్తుంది. తద్వారా రెట్టింపు లాభాలను పొందవచ్చనే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. రైస్ మిల్లర్ల తీరును ప్రభుత్వ గమనిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిజామాబాద్‌లో 39 రైస్ మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. వీటిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రగల్భాలు పలికినప్పటికీ..ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా రైతులను నిండా ముంచుతున్నవారికి వత్తాసు పలుకుతున్నట్లుగా సర్కారు చర్యలు కనిపిస్తున్నాయని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.



చెరువులో మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, మృతదేహాలను బయటికి తీసుకువస్తున్న రెస్క్యూ టీం

## దర్గాకు వచ్చి.. చెరువులో మృతదేహమై తేలి..

- నీట మునిగి ఇద్దరు యువకులు మృతి
- హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తింపు
- మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో ఘటన

మోపాల్ (ఖలీల్‌వాడి), నవంబర్ 3 : దర్గాలో ప్రత్యేక ప్రార్థనల కోసం వచ్చిన ఇద్దరు యువకులు చెరువులో నీట మునిగి మృతి చెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. మోపాల్ ఎస్సై యాదిగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రతి సంవత్సరం మాదిరిగా మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలోని దర్గా వద్దకు ప్రత్యేక ప్రార్థనల కోసం ఆదివారం వచ్చారు. ఇందులో వారి దగ్గరి బంధువులైన సయ్యద్ యాకుబ్ (32), సయ్యద్ వాసిక్ (34) ఇద్దరూ కలిసి సరదాగా స్థానిక పెద్ద చెరువు వద్దకు వెళ్లి, స్నానం కోసం అందులోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈతరాకపోవడంతో ఇద్దరూ నీట మునిగారు. గమనించిన స్థానికులు వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి వచ్చి గాలించగా.. సయ్యద్ యాకుబ్ మృతదేహం లభ్యమైంది. అనంతరం రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సయ్యద్ వాసిక్ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మృతదేహాలకు పంచనామా చేసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన సయ్యద్ వాసిక్ కరాచీ బేకరీలో అకౌంటెంట్‌గా పనిచేస్తుండగా.. యాకుబ్ ఓ మొబైల్ షాపులో పనిచేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## వీధి కుక్కల స్వైరవిహారం

భీమ్‌గల్‌లో కస్తూర్బా పాఠశాల వద్ద ఉపాధ్యాయినిపై దాడి



భీమ్‌గల్, నవంబర్ 3 : జిల్లాలో వీధి కుక్కల దాడుల కేసులు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. తాజాగా భీమ్‌గల్ మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలిపై వీధికుక్కలు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పాఠశాలలో విధులు ముగించుకొని తిరిగివెళ్తుండగా వీధికుక్కలు ఒకేసారి దాడి చేశాయి. దీంతో పొత్తి కడుపు, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స తీసుకున్నారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రతపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కస్తూర్బా పాఠశాల పక్కనే ఉన్న డంపింగ్ యార్డు, చికెన్ వ్యర్థాలు పడేయడంతో కుక్కలు అక్కడ గుంపులుగా చేరి అటుగా వెళ్తున్నవారిపై దాడులు చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కొనుగోలు చేస్తారని వచ్చి టెంట్ కింద కూర్చున్న రైతులు

## ప్రారంభిస్తామన్నారు.. పత్తాలేకుండా పోయారు..

- టెంట్ కింద రైతుల పడిగాపులు

రుద్రూర్, నవంబర్ 3 : రుద్రూర్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. రుద్రూర్ విండో ఆధ్వర్యంలో 18 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ధాన్యం సేకరణ చేపట్టలేదు. కొనుగోలు కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు కురిసిన అకాల వర్షానికి ఏడెనిమిదిసార్లు ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎండబెట్టగా..చివరకు తడిసి మొలకలు వచ్చాయి. ఆదివారం కాటా ప్రారంభిస్తామని విండో సిబ్బంది చెప్పడంతో కొంతమంది రైతులు ఆశతో వచ్చి టెంట్‌కింద పడిగాపులు కాశారు.



మహాసభలో నినాదాలు చేస్తున్న దివ్యాంగులు

## సీఎం మాటలు వేరు.. చేతలు వేరు

- వర్గీకరణ అమలుచేయకుండానే ఉద్యోగాల భర్తీ!
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




మహాసభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కామారెడ్డి, నవంబర్ 3: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వేరు, చేతలు వేరు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీకి రేవంత్ సర్కార్ సిద్ధపడుతున్నందుకు నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మయుద్ధం మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ దేశంలో ఎస్సీ వర్గీకరణ తాను మొదటగా చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వర్గీకరణ అమలుచేయకుండానే ఉద్యోగాల భర్తీకి సిద్ధపడుతున్నాడని మండిపడ్డారు. మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు నియోజకవర్గాల్లో తిరుగుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వర్గీకరణ రద్దు చేయాలని తిరుగుతున్నది మాలలేనని, వారిని ప్రోత్సహిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసినప్పుడు మాదిగలు అండగా నిలిచారని, నీతి, నిజాయితీ ఉంటే మాదిగలకు న్యాయం చేయాలన్నారు. 2004లో ఎస్సీ వర్గీకరణను 24 గంటల్లో రద్దు చేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. 2024లో ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని తీర్పు వచ్చినా ఇప్పటికీ అమలుచేయని ప్రభుత్వం కూడా కాంగ్రెస్ సర్కార్ అని తెలిపారు. దీన్నిబట్టి కాంగ్రెస్ ఎవరికి కొమ్ముకాస్తుందో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని చెప్పినా కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోలేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మన బిడ్డలు బాగుపడతారని అనుకున్నానని, కానీ కాంగ్రెస్ అడ్డుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## దివ్యాంగులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

- పింఛన్ల పెంపుపై మాటతప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- అన్ని పథకాలను వెంటనే అమలుచేయాలి
- వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్
- జిల్లా కేంద్రంలో మహాసభ

ఖలీల్‌వాడి, నవంబర్ 3 : దివ్యాంగుల కోసం ప్రకటించిన అన్ని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద ఆదివారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెన్షన్‌దారులను నట్టేట ముంచిందన్నారు. వారితో ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ సర్కార్‌కు పెన్షన్‌దారులు కనబడడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలల దాటినా దివ్యాంగులకు పెంచిన పెన్షన్లను ఇవ్వలేదని మండిపడ్డారు. వారం రోజుల్లో 10 నెలల చేయూత పెన్షన్‌ను విడుదల చేయాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని గల్లీ నుంచి రాజధాని హైదరాబాద్ వరకు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### అమలు చేయకుంటే రిలే నిరాహారదీక్షలు..

ఈ నెల 16 వరకు రోజుకు రెండు జిల్లాల వారీగా పెన్షన్ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే 17 నుంచి 23 వరకు అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ ఇవ్వకపోతే 26న పెన్షన్‌దారుల పోరాట దినంగా ప్రకటిస్తామని తెలిపారు. చేయూత పెన్షన్‌దారులందరినీ, రాజకీయ అఖిల పక్షాలను కూడా ఇందులో భాగస్వామ్యం చేసి చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని వెల్లడించారు. అదే రోజు ఇందిరాపార్కు వద్ద లక్షలాది మంది దివ్యాంగులతో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, బీడీ, గీతా కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీరప్ప, షేక్ షరీమ్, కృష్ణవేణి, సతీశ్‌కుమార్, సాయిలు, వంశీ, సాయన్న పాల్గొన్నారు.



### మా సమస్యలను పరిష్కరించాలి

మా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరకు వస్తున్నా.. ఇప్పటివరకు పెన్షన్ పెంచి ఇవ్వలేదు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలను వెంటనే అమలు చేయాలి. లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తాం.

-స్వరూప, ధర్మారం

### అన్ని పథకాలను వర్తింపజేయాలి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దివ్యాంగుల పేరు ఎత్తడం లేదు . కనీసం పెన్షన్ విషయం కూడా మాట్లాడడం లేదు. దివ్యాంగులపై చిన్న చూపు చూడకుండా అన్ని పథకాలను వర్తింపజేస్తూ, పెంచిన పెన్షన్ అమలు చేయాలి.

-లింగన్న, బోర్గాం



## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

- ఎంపీ ధర్మపురి అర్వింద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

వినాయక్‌నగర్, నవబంర్ 3: కాంగ్రెస్‌ను ఇక ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు పాతాళానికి తొక్కడం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ పార్టీ పుణ్యక్షేత్రాలపై ఒట్టు వేసి ఇప్పుడు ఆ ఒట్టును గట్టుమీద పెట్టి రైతులను నట్టేటా ముంచిందని మండిపడ్డారు. ప్రజలకు అమలుకాని హామీలు ఇవ్వకూడదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. జిల్లాలో 468 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ధాన్యం సేకరణ ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక్కడ ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇకనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు తన లెటర్‌ప్యాడ్ ప్రింట్ చేయించుకోలేదని, మంత్రి పదవి వచ్చాకే చేయించుకుంటాడేమోనని ఎద్దేవా చేశారు.

## ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, నవంబర్ 3: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 5004 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1091 అడుగుల (80.501 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువకు 3600, లక్ష్మీకాలువకు 100, మిషన్‌భగీరథకు 231, సరస్వతీకాలువకు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

